


రైతులకు అండగా..

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 8లో▸



భారీ వర్షం

దుద్యాల్ మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. 8లో▸



సమస్యల పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్



భోజనాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

యాలాల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని తాండూరు సబ్‌కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ సూచించారు. గురువారం మండలంలోని కోకట్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను సందర్శించారు. వంటగదిని పరిశీలించారు. అనంతరం భోజన వసతి ఎలా ఉందని విద్యార్థులను అడిగారు. విద్యార్థులకు మెరుగైన బోధన చేయాలని ఆదేశించారు. మెరుగైన ఫలితాల కోసం ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు.

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద విప్లవ వందనాలు తెలుపుతున్న నాయకులు

బంట్వారం: తాండూరు పట్టణంలో అక్టోబర్ 8, 9 తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని తొర్మామిడిలో చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని కోరారు. రైతు బీమా, రైతు బంధు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ భూముల్లో పంటలు సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఇటీవల కురిసిన ఎడతెరిపిలేని భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్‌చేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలని, అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ డైరెక్టర్‌గా కనకం మొగులయ్య



డీసీసీబీ చైర్మన్ సత్తయ్య నుంచి నియామక పత్రం అందుకుంటున్న మొగులయ్య

కుల్కచర్ల: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్న కనకం మొగులయ్య డీసీసీబీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. గురువారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అండగా నిలిచేవి సహకార సంఘాలు మాత్రమేనని అన్నారు. అనంతరం కనకం మొగులయ్య మాట్లాడుతూ.. మారుమూల మండలానికి చెందిన తమకు డైరెక్టర్‌గా అవకాశం లభించడం సంతోషంగా ఉందన్నారు. నాపై నమ్మకంతో అవకాశం కల్పించిన జిల్లా ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ సుబ్రహ్మణ్యం, మేనేజర్ ప్రభాకర్‌రెడ్డి, కుల్కచర్ల సహకార సంఘం డైరెక్టర్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు చందన చెరువు కట్టపై కొండా లక్ష్మణ్ విగ్రహావిష్కరణ

మీర్‌పేట: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా శుక్రవారం మీర్‌పేట చందన చెరువు కట్టపై గాయత్రీనగర్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో లక్ష్మణ్‌బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు మాకం సుధాకర్‌నేత, సలహాదారు గాజుల మధు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

గూడు.. గోడు

అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కరువు

- జిల్లాలో మొత్తం 1,106 సెంటర్లు
- సొంత భవనాలు ఉన్నవి 468
- అద్దె గదుల్లో కొనసాగుతున్నవి 185
- రెంట్ లేనివి 453



దోమ మండలం బుద్లాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించిన డ్వాక్రా భవనం

వికారాబాద్: అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక సిబ్బంది, కేంద్రానికి వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అవస్థలు పడుతున్నారు. జిల్లాలో సగానికి పైగా సొంత భవనాలు లేవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న వీటిలో కనీస వసతులు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం చాలా కేంద్రాలు అద్దె భవనాల్లో అరకొర వసతులతో నెట్టుకొస్తున్నారు. మరికొన్ని చోట్ల పాఠశాలలు, ఇళ్లలో రెంట్ లేకుండా నిర్వహిస్తున్నారు. సొంత భవనాలు లేని చోట పదే పదే కేంద్రాలను మార్చాల్సి వస్తోంది. దీంతో సిబ్బంది, లబ్ధి పొందేవారు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. గర్భిణులు, బాలింతలు, ఆరేళ్ల లోపు చిన్నారులకు వ్యాక్సినేషన్ తోపాటు పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నచూపునకు గురవుతున్నాయి.

ప్రతిపాదనలతోనే సరి

గ్రామ పంచాయతీ సభలు మొదలుకొని మండల, జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలు, స్థాయీ సంఘాల మీటింగ్‌లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్వహించే సమీక్షల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు సమకూర్చాలనే చర్చ జరుగుతోంది. ప్రతి సమావేశంలో ఈ అంశాన్ని అప్పటి సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు లేవనెత్తారు. కానీ పెద్దగా ఫలితం కనిపించలేదు. ఇప్పటి వరకు జెడ్పీ, ఏసీడీపీ నిధులతో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించారు. దాదాపు ఆరేళ్ల నుంచి సొంత భవనాల కోసం ప్రతిపాదనలు పంపుతున్నా నిధులు మాత్రం మంజూరు కావడం లేదు.

468 కేంద్రాలకే సొంతంగా..

జిల్లాలో వికారాబాద్, మర్పల్లి, పరిగి, తాండూరు, కొడంగల్ ప్రాంతాల్లో ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. కొడంగల్ ప్రాజెక్టు పరిధిలో 234 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా తొమ్మిది చోట్ల మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. 92 సెంటర్లను అద్దె భవనాల్లో నిర్వహిస్తుండగా 133 కేంద్రాలను పాఠశాలలు, ఇళ్లల్లో అద్దె లేకుండా కొనసాగిస్తున్నారు. పరిగి ప్రాజెక్టు పరిధిలో 213 కేంద్రాలు ఉండగా 109 సొంత భవనాలు, 11 అద్దె భవనాల్లో, 93 పాఠశాలలు ఇతర చోట్ల నిర్వహిస్తున్నారు. మర్పల్లి ప్రాజెక్టు పరిధిలో 148 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 104 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. నాలుగు కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తుండగా 40 కేంద్రాలను పాఠశాలలు ఇతర చోట్ల నిర్వహిస్తున్నారు. వికారాబాద్ ప్రాజెక్టు పరిధిలో 232 కేంద్రాలు ఉండగా 101 చోట్ల సొంత భవనాలు, 24 చోట్ల అద్దె గదుల్లో, 107 చోట్ల ఇతర అందుబాటులో ఉన్న గదుల్లో నిర్వహిస్తున్నారు. తాండూరు ప్రాజెక్టు పరిధిలో మొత్తం 279 అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా 145 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. 54 కేంద్రాలను అద్దె గదుల్లో, 80 చోట్ల రెంట్ లేకుండా కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 56,900 మంది చిన్నారులు, 6,313 మంది గర్భిణులు, 5,683 మంది బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు సమకూర్చాలని పలువురు కోరుతున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

- అక్టోబర్ 3 నుంచి 9వ తేదీ వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు
- అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: జిల్లాలో అక్టోబర్ 3 నుంచి 9వ తేదీ వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో విద్యాశాఖ, విద్యుత్, ఆర్టీసీ, పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వికారాబాద్‌లోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో 166 మంది ఓపెన్ టెన్త్ విద్యార్థులు పరీక్షలు రాస్తారని చెప్పారు. జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో 150 మంది ఇంటర్ అభ్యర్థులు పరీక్షలు రాస్తారని వివరించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయం ఉండేలా చూడాలన్నారు. పరీక్ష జరిగే సమయంలో సెంటర్ల వద్ద జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలన్నారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వరాదని సూచించారు. పరీక్షలు నిర్వహించే సూపరింటెండెంట్లు, ఎన్విజిలేటర్లకు శిక్షణ ఇవ్వాలన్నారు. అభ్యర్థుల కోసం ఆర్టీసీ బస్సులను సిద్ధంగా ఉంచాలన్నారు. ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదని అన్నారు. ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు మెడికల్ కిట్స్‌తో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేందుకు రెవెన్యూ, విద్య, వైద్య, పోలీసు శాఖలు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఈఓ రేణుకాదేవి, విద్యుత్ శాఖ ఎస్ఈ సంజీవ్ రెడ్డి, ఆర్టీసీ మేనేజర్ అరుణ, ఎస్ఐ అబ్దుల్ హఫీజ్ , పద్మారావు, రామ్‌రెడ్డి, నాగ మల్లేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు



ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అడిషనల్ కలెక్టర్లు, అధికారులు

పోరాట యోధురాలు ఐలమ్మ

- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: వీరనారి చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలు అని, ఆమె ఆశయాలను ప్రతి ఒక్క రూ స్ఫూర్తిగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ముఖ్య భూమిక పోషించారని తెలిపారు. తెలంగాణ పౌరుషాన్ని, పోరాటాన్ని, త్యాగాన్ని భావితరాలకు అందించి ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన గొప్ప పోరాట యోధురాలని కొనియాడారు. ఆమె జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఉపేందర్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి, డీపీఆర్ఓ చెన్నమ్మ, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి మోహన్ బాబు, పీఆర్ ఈఈ ఉమేష్ కుమార్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం

జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న పల్వన్ కుమార్

కుల్కచర్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందుతోందని జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్ అన్నారు. గురువారం కుల్కచర్ల ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం తాగునీటి వసతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించి వారి ఆరోగ్య సంరక్షణకు అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అన్ని ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పిస్తోందని తెలిపారు. నిబంధనలు పాటించని ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. అర్హత గల ఆర్ఎంపీ వైద్యులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ జీవరాజ్, డాక్టర్ రవీంద్ర యాదవ్, కుల్కచర్ల మండల వైద్యాధికారి వాజుద్దీన్, శ్రీనివాసులు డెమో, డీపీహెచ్ఎన్ఓ చండీశ్వరి, సీహెచ్ఓ సిరాజుద్దీన్, వైద్య సిబ్బంది అనురాధ, శ్రీనివాసులు, వెంకటయ్య, అంజు, రాజు, ఆనంద్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



బుద్లాపూర్‌లో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఓ సౌభాగ్యలక్ష్మి కుమారి

పరిగి/దోమ: రైతులు వ్యవసాయ అధికారుల సూచనలతో పంటలు సాగు చేయాలని ఏడీఓ సౌభాగ్యలక్ష్మి కుమారి సూచించారు. గురువారం పరిగి, దోమ మండలాల్లో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధిక వర్షాలకు పత్తి, వరి, సోయాబీన్, మినుము, కంది, పెసర పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. ప్రస్తుతం తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పరిగి, దోమ వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఎన్నో సమస్యలకు యోగాతో పరిష్కారం

విశ్రాంత ఐఏఎస్ అధికారి అజయ్‌మిశ్రా

హుడాకాంప్లెక్స్: భారతీయ సంస్కృతిలో యోగా శాస్త్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని విశ్రాంత ఐఏఎస్ అధికారి అజయ్‌మిశ్రా అన్నారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో గురువారం ఐఎంసీటీఎఫ్ నిర్వహించిన యోగాథాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచం ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపగల సత్తా భారతీయ యోగా శాస్త్రానికి ఉందన్నారు. నేటి విద్యార్థులు, యువత ఒత్తిడికిలోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, కార్పొరేట్ స్థాయిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు విపరీతమైన పని ఒత్తిడితో అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఎన్నో సమస్యలకు ఏకైక పరిష్కారం యోగాభ్యాసమేనని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదన్నారు. అందుకే ప్రధాని జూన్ 21న ఇంటర్నేషనల్ యోగాడేగా నిర్ణయించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఐఎంసీటీఎఫ్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, క్యాదర్శి రామ్మూర్తి, సంయుక్త కార్యదర్శి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ బాధ్యత మాకొద్దు బాబోయ్!

- ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా జీహెచ్‌ఎంల నిరాసక్తత
- డీఈఓకు నాట్‌విల్లింగ్ లేఖ రాసిన విజయ్‌కుమార్



విజయ్‌కుమార్, జీహెచ్‌ఎం

బషీరాబాద్: జిల్లా సరిహద్దులోని బషీరాబాద్‌లో విధులు అంటేనే అధికారులు హడలిపోతున్నారు. ఈ మండలంలో పనిచేయడానికి ఆయా శాఖల అధికారులు నిరాసక్తత చూపుతుంటారు. వచ్చిన వెంటనే పైరవీలతో డిప్యుటేషన్ వేసుకొని మరో ప్రాంతానికి వెళుతున్నారు. తాజాగా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మండలాలకు కొత్త విద్యాధికారులను నియమించింది. ఇందులో భాగంగా మండలంలోని జీవన్గీ జెడ్పీహెచ్ఎస్ జీహెచ్ఎంగా పనిచేస్తున్న గొబ్బూర్ విజయ్‌కుమార్‌ను ఎంఈఓగా నియమిస్తూ రెండు రోజుల క్రితం సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే తాను ఎంఈఓగా బాధ్యతలు మోయలేనని, ఆరోగ్య సమస్యల వల్ల హెచ్‌ఎంగానే కొనసాగుతునని డీఈఓకు నాట్ విల్లింగ్ లేఖ రాశారు. దీంతో ఇప్పటికీ యాలాల ఎంఈఓ సుధాకర్‌రెడ్డి బషీరాబాద్ మండల ఇన్‌చార్జ్ బాధ్యతల్లో కొనసాగుతున్నారు. ఇదిలా ఉండగా తర్వాతి స్థానంలో ఉన్న రెడ్డిఘణాపూర్ జెడ్పీ పాఠశాల జీహెచ్‌ఎం శ్రీదేవి కూడా ఆసక్తి చూపడం లేదు. తనకు ఆ పదవి వద్దంటూ ఇప్పటికే అధికారులకు మౌఖికంగా విజ్ఞప్తి చేశారు. పనిభారంతోనే ఈ పదవికి నిరాసక్తి చూపుతున్నారని పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయ పడుతున్నారు.

కొత్త ఎంఈఓగా దోస రాములు?

మండలంలోని ఇద్దరు జీహెచ్‌ఎంలు ఎంఈఓ పదవి చేపట్టడానికి నిరసక్తి చూపడంతో మూడో స్థానంలో ఉన్న మంతట్టి జీహెచ్‌ఎం దోస రాములుకు అవకాశం ఉంది. రెండు మూడు రోజుల్లో అతడిని ఎంఈఓగా నియమించే అవకాశాలు ఉన్నాయని విద్యాధికారులు చెబుతున్నారు.

2008 డీఎస్సీ అభ్యర్థులకు శుభవార్త

- నేటినుంచి సర్టిఫికెట్ల పరిశీలన
- ఉమ్మడి జిల్లాలో 344 మందికి ఊరట

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పరీక్ష రాసి, పదహారేళ్లుగా పోస్టింగ్‌ల కోసం ఎదురు చూస్తున్న డీఎస్సీ–2008 అభ్యర్థులకు శుభవార్త. అర్హులైన ఆయా అభ్యర్థులకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగ అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా వారి సమస్యను పరిష్కరించడంతో పాటు అభ్యర్థులకు కొంత వరకు న్యాయం చేకూర్చవచ్చని భావించింది. ఈ మేరకు ఉమ్మడిజిల్లా పరిధిలోని (మేడ్చల్, వికారాబాద్, రంగారెడ్డి) అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు తేదీలకు సైతం ప్రకటించింది. శుక్రవారం నుంచి అక్టోబర్ 5వతేదీ వరకు కలెక్టరేట్‌లోని విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించేందుకు ఏర్పాట్లు చేసింది. వీరిలో అర్హులైన అభ్యర్థులకు ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగ అవకాశం కల్పించనుంది. ఇప్పటికే ఆయా అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. జీత భత్యాల చెల్లింపు, సర్వీసు రూల్స్ అంశాలపై మంత్రి వర్గ ఉప సంఘం ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. పూర్తిస్థాయి విధివిధానాలు రూపొందించిన తర్వాత వీరికి నియామకపత్రాలు అందజేయనుంది.



ప్రకృతి సిరి.. అనంతగిరి

- పర్యాటకులను మంత్ర ముగ్ధులను చేస్తున్న అటవీ అందాలు
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం





అనంతగిరి: హైదరాబాద్‌కు 70 కిలో మీటర్ల దూరంలో ఉన్న అనంతగిరి కొండలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడి చల్లటి వాతావరణం, పచ్చని చెట్లు, చూడ ముచ్చట గొలిపే పక్షులు, సున్నిత శబ్దాలు చేసే రకరకాల పక్షులు, మలుపులు తిరిగే రోడ్లు, వ్యూ పాయింట్లు, ఘాట్ రోడ్లు, పచ్చని గడ్డితో పరిచిన మైదానాలు పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. అటవీ ప్రాంతంలో సంచరించడం గొప్ప అనుభూతిని కలిగిస్తుంది. ప్రతి వారాంతంలో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. వేల సంఖ్యలో ఇక్కడికి వచ్చి సేదతీరుతుంటారు. నగరం నుంచి అనంతగిరికి మెరుగైన రవాణా సదుపాయం ఉంది. రైలు, రోడ్డు మార్గాల్లో ఇక్కడికి చేరుకోవచ్చు. ఉదయం వచ్చి సాయంత్రం గమ్య స్థానాలకు చేరుకునే అవకాశం ఉంది. ఈ ప్రాంతాన్ని టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇక్కడ ఏళ్ల చరిత్ర గల అనంత పద్మనాభ స్వామి ఆలయం ఉంది. ఇక్కడికి వచ్చే పర్యాటకులు ముందుగా స్వామివారిని దర్శించుకుంటారు. అనంతగిరిని పర్యాటకంగా తీర్చిదిద్దడానికి స్వదేశీ దర్శన్ కింద రూ.100 కోట్లు మంజూరు చేశారు. ఇక్కడికి వచ్చే పర్యాటకుల కోసం టూరిజం శాఖకు చెందిన 36 నుంచి 40 ఏసీ గదులు అందుబాటులో ఉన్నాయి. వీటికి తోడు ప్రైవేటు రిసార్టులు పర్యాటకులను ఆకట్టుకునే రీతిలో ఏర్పాట్లు చేశారు.

క్లుప్తంగా

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా కన్వీనర్‌ గీత


వాల్‌పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న రైతులు

పరిగి: కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా కన్వీనర్‌ గీత అన్నారు. గురువారం వారు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30న నగరంలో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు, కాంట్రాక్ట్‌ ఉద్యోగులకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని డిమాండ్‌ చేస్తూ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఇందిరా పార్క్‌ వద్ద నిర్వహించనున్న ఈ ధర్నాకు కార్మికులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్‌, నర్సింలు, శేఖర్‌, మాణిక్యం, చంద్రానాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

అనంతగిరి: వాహనదారులు ట్రాఫిక్‌ నిబంధనలు తప్పక పాటించాలని వికారాబాద్‌ ఎస్‌ఐ శ్రీనివాస్‌ అన్నారు. గురువారం ఆయన వికారాబాద్‌ పట్టణంలోని ఎన్టీఆర్‌ చౌరస్తాలో వాహనదారులకు రోడ్డు నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డుపై వాహనాలు నడిపే సమయంలో అన్ని ధ్రువపత్రాలు కలిగిఉండాలన్నారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. అతివేగంతో వాహనాలు నడిపిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేశం, సిబ్బంది శ్రీనివాస్‌, కృష్ణ తదితరులున్నారు.

దురాక్రమణకు యత్నం

రైతుపై కేసు

ధారూరు: అటవీ సంరక్షణకు ఏర్పాటు చేసిన కందకాన్ని పూడ్చి.. వెదురు చెట్లను కొట్టివేసి పొలానికి దారి వేసుకున్న రైతుపై గురువారం కేసు నమోదైంది. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్‌ తెలిపిన ప్రకారం.. ధారూరు అటవీ సెక్షన్‌ పరిధిలోని రాంపూర్‌ తండా సమీప కంపార్ట్‌మెంట్‌ 97 వద్ద కందకం తవ్వించారు. ఈ నెల 23న డీఎఫ్‌ఆర్‌ఓ హేమ పెట్రోలింగ్‌ చేస్తుండగా కందకాన్ని పూడ్చి.. 16 వెదురు చెట్లను ధ్వంసం చేసినట్లు గుర్తించారు. ఈ దురాక్రమణకు పాల్పడిన రైతు రవీందర్‌ను పిలిపించి మాట్లాడగా దారి కోసం తానే చేసినట్లు ఒప్పుకొన్నాడు. రవీందర్‌పై అటవీ చట్టం 1967 ప్రకారం చర్యలు తీసుకోవాలని డీఎఫ్‌ఆర్‌ఓ హేమ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

అదృశ్యమైన వ్యక్తి.. శవమై తేలాడు


నిజాముద్దీన్‌(ఫైల్‌)

పరిగి: మూడు రోజులుగా కనిపించకుండా పోయిన వ్యక్తి చెరువులో శవమై తేలాడు. ఈ ఘటన మండల పరిధిలోని రాఘవాపూర్‌లో గురువారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం మహ్మద్‌ నిజాముద్దీన్‌(47) అవివాహితుడు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈయన మూడు రోజులుగా కనిపించడం లేదు. గురువారం గ్రామ సమీపంలోని చెరువు ఒడ్డున చెప్పులు, బట్టలు ఇతర సామగ్రి ఉండడం.. చెరువులో మృతదేహం కనిపించడంతో గమనించిన వారు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తన తమ్ముడి మృతిపై అనుమానం ఉందంటూ జహంగీర్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోశ్‌కుమార్‌ తెలిపారు.

భారీ వర్షం

నిలిచిన రాకపోకలు

దుద్యాల్‌: ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు కుంటలు అలుగు పారుతున్నాయి. మండల పరిధిలోని కుదురుమల్ల గ్రామంలో రోడ్లపై వరద పారుతూ కుంటలను తలపిస్తున్నాయి. కుదురుమల్ల–ఇముదాపూర్‌ మార్గంలో ఉన్న తోటవాగు ఉప్పొంగడంతో కుదురుమల్ల–దౌల్తాబాద్‌ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువ నుంచి భారీ వరద నీరు వస్తుడడంతో కొత్త చెరువు అలుగు పారుతోంది. ప్రజలు అప్రమత్తంగా అండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

వర్షాలకు కూలుతున్న ఇళ్లు

తాండూరు టౌన్‌: ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని ఇందిరానగర్‌లో గురువారం ఓ ఇల్లు కుప్పకూలింది. వివరాలు.. అంతారం గ్రామానికి చెందిన రాములు అనే వ్యక్తికి చెందిన ఇంట్లో రెండు కుటుంబాలు నివసిస్తున్నాయి. ఓ గది రెండు నెలలుగా ఖాళీగా ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షాలకు పైకప్పు బండలతో ఉన్న ఇల్లు పెద్ద శబ్దంతో ఒక్క సారిగా కుప్పకూలింది. పక్కనే ఉన్న రెండు కుటుంబాలు భయంతో ఒక్కసారిగా పరుగు తీశారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


అలుగు పారుతున్న కొత్త చెరువు

చౌడాపూర్‌లో రెండు..

కుల్కచర్ల: ఇటీవల కురుస్తున్న వర్షాలకు రెండు ఇళ్లు కూలిపోయాయి. ఈ ఘటన చౌడాపూర్‌ మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. ఎడ్ల శివమ్మ, జంబుల సాయమ్మ ఇళ్లు 15 రోజుల క్రితం కురిసిన వర్షాలకు కురుస్తున్నాయి. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు కూలిపోయాయి. దీంతో తమకు నిలువ నీడ లేక ఇబ్బంది పడుతున్నామని అధికారులు తమకు ఆశ్రయం కల్పించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలన్నారు. చౌడాపూర్‌ రెవెన్యూ సూపరింటెండెంట్‌ లింగయ్య, పంచాయతీ కార్యదర్శి రంజిత్‌ కూలిన ఇళ్లను పరిశీలించారు.


ఉధృతంగా ప్రవహిస్తున్న తోట వాగు


తాండూరు టౌన్‌ కుప్పకూలిన ఇల్లు

బిల్లులు ఇస్తారా.. ఉరేసుకోవాలా?

మన ఊరు–మన బడి
కాంట్రాక్టర్ల వినూత్న నిరసన

పరిగి: మన ఊరు–మన బడి కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు వెంటనే విడుదల చేయాలని కాంట్రాక్టర్లు ఆందోళన చేపట్టారు. గురువారం వారు అంబేడ్కర్‌ విగ్రహం వద్ద ఉరితాళ్లతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మన ఊరు–మన బడి కార్యక్రమం చేపడితే అప్పులు చేసి పనులు పూర్తి చేశామన్నారు. ఏడాదిన్నర అవుతున్న బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో తాము పనులు చేసి ప్రభుత్వ పాఠశాలలను బాగు చేస్తే బిల్లులు చెల్లించకపోవడం విచారకరమన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా చేపట్టిన పనులకు బిల్లులు చెల్లిస్తున్నారు కానీ పాత బిల్లులు చెల్లించకుంటే ఆత్మహత్యలే శరణ్యమన్నా రు. ఈ కార్యక్రమంలో పీఎస్‌పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్‌, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.


ఉరితాళ్లతో నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టర్లు

పెట్రోల్‌లో నీళ్లు

వాహనదారుల ఆందోళన

పెద్దేముల్‌: మండల పరిధిలోని కందనెల్లి శివారులోని ఎస్సార్‌ బంక్‌లో పెట్రోల్‌తో పాటు నీళ్లు వస్తున్నాయని వాహనదారులు ఆరోపించారు. పెట్రోల్‌ పోయించిన కాసేపటికే వాహనాలు మొరాయించడంతో వారు ఇబ్బంది పడ్డారు. గురువారం పెట్రోల్‌ పోయించిన పలువురు వాహనదారులు కొద్ది దూరం ప్రయాణించిన వెంటనే ఆగిపోయాయి. ఎంతకూ స్టార్ట్‌ కాకపోవడంతో మెకానిక్‌ను ఆశ్రయించారు. మెకానిక్‌ పెట్రోల్‌ పరిశీలించగా నీరు కలిసిందని చెప్పడంతో వినియోగదారులు ఖంగుతిన్నారు. వారు బంక్‌ సిబ్బందిని నిలదీయడంతో యజమానులు వచ్చారు. వారు సమాధానం ఇవ్వలేకపోయారు. పలువురు బాధితులు తహసీల్దార్‌ కిషన్‌కు ఫిర్యాదు చేయగా సివిల్‌సప్లై అధికారులకు ఫిర్యాదు చేయాలని సలహా ఇచ్చారని ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ఇదే విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా ఇది సివిల్‌సప్లై పరిధిలోకి వస్తుందని వారికి ఫిర్యాదు చేయాలని చెప్పామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బంక్‌ యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పెట్రోల్‌ బంక్‌ వద్ద బాధితులు

తీగలాగితే.. డొంక కదిలింది!

- వాహన తనిఖీల్లో పట్టుబడిన కల్తీ టీపొడి
- పట్టుబడిన వ్యక్తి ఇచ్చిన సమాచారంతో రెండు క్వింటాళ్లు స్వాధీనం
- ఇద్దరు వ్యక్తులపై కేసు

కుల్కచర్ల: వాహనాల తనిఖీల్లో కల్తీ టీపొడి లభ్యమైంది. ఈ ఘటన కుల్కచర్లలో గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల కేంద్రంలో సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా గండీడ్‌ మండల కేంద్రానికి చెందిన సురేశ్‌ రెండు బ్యాగుల్లో 60 కిలోల టీ పొడి తీసుకువస్తున్నారు. అనుమానం వచ్చిన పోలీసులు వాటిని పరిశీలించగా కల్తీ టీపొడర్‌గా తేలింది. దీంతో ఆయన్ను విచారించగా నగరానికి చెందిన వెంకటప్రసాద్‌ వద్ద టీపొడి తీసుకువచ్చినట్లు చెప్పారు. అప్రమత్తమైన పోలీసులు టాస్క్‌ ఫోర్స్‌ అధికారులు సమాచారం ఇచ్చారు. గురువారం నగరంలో దాడులు నిర్వహించిన పోలీసులు వెంకటప్రసాద్‌ వద్ద రెండు క్వింటాళ్ల నకిలీ టీపొడిని స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రసాయనాలను ఉపయోగించి కల్తీ టీ పొడిని తయారు చేస్తున్నట్టు గుర్తించారు. ఈ మేరకు సురేష్‌ మరియు వెంకటప్రసాద్‌లపై కుల్కచర్లలో కేసు నమోదు చేశారు.


కల్తీ టీపొడి సరఫరా చేస్తున్న నిందితులు

గ్రామ సమస్యలు పరిష్కరించండి


కడా అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కుదురుమల్ల గ్రామస్తులు

దుద్యాల్‌: కుదరుమల్ల గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని గ్రామస్తులు గురువారం కడా అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో మురుగు కాల్వలు లేక వరద ప్రధాన రోడ్ల వెంట ప్రవహిస్తూ నడవడానికి సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సీసీ రోడ్లు లేక దారులు బురదమయంగా మారుతున్నాయన్నారు. డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మించి సమస్య పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో శ్రీనివాస్‌, సాయిలు, పెద్ద లక్ష్మణ్‌ ప్రకాశ్‌, శివకుమార్‌, శ్రీనివాస్‌, కిష్టప్ప, అశోక్‌, చిన్న బందెప్ప, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా పోరాడుతాం

- ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే వ్యక్తిగత దూషణలు, దాడులు
- నారెగూడ రైతులను పరామర్శించిన మాజీ మంత్రి సబితారెడ్డి


నారెగూడలో రైతులతో మాట్లాడుతున్న సబితారెడ్డి

నవాబుపేట: రుణమాఫీ చేస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 19న రుణమాఫీ కానీ రైతులు ప్రజాభవన్‌ ముట్టడికి వెళ్లిన రైతులను పోలీసులు అరెస్ట్‌ చేసిన నేపథ్యంలో గురువారం సబితారెడ్డి, బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్‌ మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌ నారెగూడ గ్రామ రైతులతో మాట్లాడారు. గ్రామంలో 312మంది రైతులకు రుణమాఫీ కాలేదని చెప్పారు. విద్యుత్‌ సరఫరా సరిగా ఉండడం లేదని తదితర సమస్యలను రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆమె బ్యాంక్‌ మేనేజర్‌ను కలిసి రుణమాఫీపై ప్రశ్నించారు. ఈకేవైసీ, ఆధార్‌ తప్పులతో రుణమాఫీ కాలేదని మేనేజర్‌ సబితారెడ్డికి వివరించారు. అనంతరం ఆమె ఇద్దరు రైతులను మాజీ మంత్రి కేటీఆర్‌తో మాట్లాడించారు. రైతులకు అండగా తమ పార్టీ నిరంతరం పోరాడుతుందని కేటీఆర్‌ చెప్పారన్నారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ.. రుణమాఫీపై ప్రశ్నిస్తే రైతులను పోలీస్‌స్టేషన్‌లో పెట్టడం సరికాదని మండిపడ్డారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని అడుగుతుంటే సాకులు చూపుతూ.. రుణమాఫీ చేయడం లేదని విమర్శించారు. హైడ్రా పేరిట పేదల ఇళ్లను కూలుస్తూ.. పెద్దలకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌ ఇప్పటి వరకు బీమా పైకం చెల్లించలేదన్నారు. తమ గ్రామానికి బస్సు వచ్చేలా చూడాలని కోరగా.. మరో యువకుడు స్పందిస్తూ ఎమ్మెల్యే స్వగ్రామానికే బస్సు లేదు.. మన గ్రామానికి వేయిస్తారా అంటూ ప్రశ్నించాడు. అందుకు స్పందించిన సబితారెడ్డి కొంకట్లకు బస్సు వేయిస్తే ప్రజలు వినియోగించుకోకపోవడంతో బస్సు నిలిపివేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్‌ చైర్మన్‌ విజయ్‌కుమార్‌, మాజీ ఎంపీపీ చంద్రకళ, నాయకులు భరత్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సయ్యద్‌గౌస్‌, శాంత కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు

మర్పల్లి: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటనలో ఏ సంబంధం లేని దళిత కుటుంబానికి చెందిన ప్రవీణ్‌, నవీన్‌లను మర్పల్లి పోలీసులు అకారణంగా శిక్షించడం కక్ష సాధింపు చర్యలేనని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆరోపించారు. గురువారం ఆమె మండల పరిధిలోని పట్లూర్‌కు చెందిన బాధిత కుటుంబాలను బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఘటన విషయాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా బీఆర్‌ఎస్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. మృతదేహాన్ని గుర్తించకుండానే కాంగ్రెస్‌ నాయకుల ఒత్తిడి మేరకు బీఆర్‌ఎస్‌ నాయకులను శిక్షించడం సరికాదన్నారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చాక పట్లూర్‌, దార్గులపల్లి, బూచన్‌పల్లి చెందిన వ్యక్తులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. విషయాన్ని ఉన్నతాధికారులకు వివరిస్తామని.. బాధితులకు న్యాయం జరిగేంత వరకు వారికి అండగా ఉద్యమిస్తామన్నారు. ప్రవీణ్‌, నవీన్‌ అరెస్ట్‌పై డీజీపీ, ఎస్పీ, మర్పల్లి ఎస్‌ఐతో ఫోన్‌లో మాట్లాడారు. ఆమె వెంట బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మధుకర్‌, మాజీ వైస్‌ ఎంపీపీ మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాచన్న, ఉపాధ్యక్షుడు అశోక్‌, రమేష్‌మిత్ర, యూత్‌ మండల అధ్యక్షుడు మధు తదితరులున్నారు.

నోరు పారేసుకుంటే ఊరుకోం


సమావేశంలో మాట్లాడుతున్న మధుకర్‌

మర్పల్లి: అధికార పార్టీ నాయకులు బీఆర్‌ఎస్‌ నేతలపై, మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌పై నోరు పారేసుకుంటే చూస్తూ ఊరుకొనేది లేదని మర్పల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పబ్బే మధుకర్‌ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని పట్లూర్‌ గ్రామానికి చెందిన గుర్తు తెలియని మృతదేహాన్ని మర్పల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై అధికారపార్టీ నేతల తీరు సరైంది కాదన్నారు. ఇక ముందు తమ పార్టీ నాయకులపై ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చి నాటి నుంచి మండలంలో తమ పార్టీకి చెందిన 10 మందిపై అక్రమంగా కేసులు పెట్టి హింసిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు రాచన్న, అశోక్‌, రమేష్‌మిత్ర, మోహన్‌రెడ్డి, సోయేల్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ పటిష్టానికి కృషి

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల్లో విద్యావ్యవస్థను బలోపేతం చేస్తూ అభివృద్ధిపథంలో ముందుకు తీసుకువెళ్లాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. నూతనంగా చౌడాపూర్‌ ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన రాంచందర్‌ను గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలను పర్యవేక్షించి పాఠశాలలలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో కుల్కచర్ల ఎంఈఓ హబీబ్‌ అహ్మద్‌, సీఆర్పీలు రఘు, విజయ్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



ఎంఈఓకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


రాజు(ఫైల్‌)

దోమ: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని దిర్సంపల్లికి చెందిన బొల్లం రాజు(28) తన పొలం వద్ద ఉన్న నివాస స్థలంలో విద్యుత్‌ మరమ్మతులు చేస్తూ విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి వికారాబాద్‌కు రెఫర్‌ చేశారు. వికారాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడి భార్య ఉంది.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా


క్యారమ్స్‌ ఆడుతున్న వృద్ధులు

అనంతగిరి: అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం వికారాబాద్‌ మున్సిపల్‌ కొత్తగడి సమీపంలోని మహిమ మినిస్ట్రీస్‌ వృద్ధాశ్రమంలో ఆటపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు క్యారమ్స్‌, చెస్‌తో పాటు పలు ఆటలు ఆడుతూ ఆహ్లాదంగా గడిపారు.

గుర్రం దాడిలో యువకుడికి తీవ్రగాయాలు

- ఉరికించి కొరికిన అశ్వం
- తెగిపడిన చిటికెన వేలు
- కాళ్లు, చేతులకు గాయాలు
- గాంధీ ఆస్పత్రికి తరలింపు

బషీరాబాద్‌: గుర్రం దాడిలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని జీవన్గీలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం సేడం తాలుకాలోని జెట్టూరు గ్రామానికి చెందిన మహబూబ్‌సాబ్‌ కొడుకు గూడ్‌సాబ్‌(23) గుర్రాలను పోషిస్తుంటాడు. గురువారం వీటిని మేతకు తీసుకెళ్లగా ఓ ఆడ గుర్రం తప్పిపోయింది. దీన్ని వెతుక్కుంటూ వెళ్లిన గూడ్‌సాబ్‌ పక్కనే ఉన్న తెలంగాణలోని జీవన్గీ శివారుకు చేరుకున్నాడు. ఇక్కడ మరో మగ గుర్రంతో కలిసి మేస్తున్న తన గుర్రాన్ని గమనించాడు. దానికి ఉన్న తాడు పట్టుకుని తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా.. గమనించిన మగ గుర్రం అతనిపై దాడికి దిగింది. తలతో కుమ్మి కిందపడేసింది. తప్పించుకునేందుకు ప్రయత్నించగా కాళ్లు, చేతులపై నోటితో కరిచి తీవ్రంగా గాయపర్చింది. కుడిచేతి చిటికెన వేలిని పూర్తిగా కొరికేసింది. కిలోమీటర్‌ మేర వెంబడించి కాళ్లతో తొక్కింది. ప్రాణభయంతో హడలిపోయి, పరుగెత్తుతున్న గూడ్‌సాబ్‌ను గమనించిన స్థానికులు.. కర్రలతో బెదిరించడంతో గుర్రం ఆగిపోయింది. అనంతరం బాధితుడిని ఆటోలో తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి రిఫర్‌ చేశారు. చిన్ననాటి నుంచి గుర్రాలంటే ఎంతో ఇష్టపడే గూడ్‌సాబ్‌ ఎక్కడికైనా గుర్రంపైనే వెళ్లేవాడని, ఇలా మరో గుర్రం దాడిలో గాయపడటం బాధగా ఉందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. అయితే జతగా వచ్చిన ఆడ గుర్రాన్ని తీసుకెళ్లేందుకు ప్రయత్నించాడనే కారణంతోనే మగ గుర్రం అతడిపై దాడి చేసిందని స్థానికులు తెలిపారు.


గుర్రం దాడిలో గాయపడిన గూడ్‌సాబ్‌


దాడిలో విరిగిన చిటికన వేలు

పంచాయతీ అధికారుల నిరసన

మొయినాబాద్‌ రూరల్‌: సస్పెండైన ఎంపీడీఓ, ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను విధుల్లోకి తీసుకోవాలని మొయినాబాద్‌ మండల పంచాయతీ అధికారులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గురువారం మండల పరిషత్‌ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం మండల అభివృద్ధి అధికారి సంధ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నల్గొండ జిల్లాలోని గుర్రంపోడు ఎంపీడీఓ మంజుల, పెద్దపురం మండలం పుంచర్ల పంచాయతీ కార్యదర్శి నాగరాజు, దామరచెర్ల మండలం వాక్యాతండా జూనియర్‌ పంచాయతీ కార్యదర్శి స్వప్నను కలెక్టర్‌ సస్పెండ్‌ చేయడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టామన్నారు. పంచాయతీల్లో కార్మికులకు వేతనాలు ఇవ్వడానికి ఇబ్బందికరంగా ఉన్న పరిస్థితుల్లో పంచాయతీలకు సంబంధించిన పరికరాలు, శానిటేషన్‌, కంపోస్టు, షెడ్డులను సక్రమంగా ఉంచలేదనే కారణాలతో సస్పెండ్‌ చేయడం సరికాదన్నారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, సూపరింటెండెంట్‌ రెహమాన్‌, సీనియర్‌ అసిస్టెంట్‌ కులశేఖర్‌, పంచాయతీ కార్యదర్శులు రంజిత్‌కుమార్‌, సురేందర్‌, సుదర్శన్‌, నరేష్‌, యాదగిరి, రజిత, తారాబాయి, వెంకటయ్య, ప్రసాద్‌ పాల్గొన్నారు.